AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
WWW.AKSHARATODAY.IN
20-11-2025 (Thursday) MAIN EDITION

## గాజాలో ఇజ్రాయిల్ దాడులు..



**అక్షరటుడే, నేషనల్‌డెస్క్:** పాలస్తీనా – ఇజ్రాయిల్ మధ్య మరోసారి ఉద్రిక్తత చోటుచేసుకుంది. గాజాపై ఇజ్రాయిల్ దళాలు విరుచుకుపడ్డాయి. ఐడీఎఫ్ చేసిన దాడుల్లో 20 మందికిపైగా మరణించినట్లు గాజాడిఫెన్స్ ఏజెన్సీ తెలిపింది. గాజా నగరం, ఖాన్ యూనిస్ ప్రాంతాలపై బుధవారం అర్ధరాత్రి సమయంలో (భారత కాలమానం ప్రకారం) ఇజ్రాయిల్ దాడికి దిగింది. రక్షణ దళాలు నిర్వహించిన తాజా దాడుల్లో 20 మందికి ప్రాణాలు కోల్పోగా.. 70 మందికి పైగా గాయపడినట్లు తెలుస్తోంది.

## యాసిడ్ ట్యాంకర్‌ని ఢీకొట్టిన ట్రావెల్స్ బస్సు



**అక్షరటుడే, మహబూబ్‌నగర్:** కొద్ది రోజులుగా జరుగుతున్న బస్సు ప్రమాదాలు ప్రయాణికులను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలం మాచారం సమీపంలోని 44వ జాతీయ రహదారిపై గురువారం తెల్లవారుజామున పెద్ద ప్రమాదం చోటుచేసుకుంది. హైడ్రోక్లోరిక్ యాసిడ్‌తో వెళ్తున్న ట్యాంకర్‌ను వెనుక నుంచి జగన్ ట్రావెల్స్ బస్సు ఢీకొట్టింది. ప్రమాదంలో పలువరికి స్వల్ప గాయాలయ్యాయి.

## కల్పవృక్ష వాహనంపై అమ్మవారు..



**అక్షరటుడే, తిరుపతి:** తిరుచానూరు పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. నాలుగో రోజు గురువారం అమ్మవారు కల్పవృక్ష వాహనంపై మురళీకృష్ణ అలంకారంలో భక్తులకు అభయమిచ్చారు. భక్తజన బృందాలు భజనలు, కోలాటాలు, మంగళవాయిద్యాల మధ్య వాహనసేవ సాగింది.

## సీబీఐ కోర్టులో విచారణకు జగన్



**అక్షరటుడే, హైదరాబాద్:** అక్రమాస్తుల కేసులో వైసీపీ అధినేత, మాజీ సీఎం జగన్ సీబీఐ ప్రత్యేక కోర్టుకు హాజరయ్యారు. జడ్జి ఎదుట విచారణకు వచ్చారు. విజయవాడ నుంచి బేగంపేట ఎయిర్‌పోర్టుకు వచ్చి అక్కడి నుంచి నాంపల్లిలోని కోర్టుకు ఆయన చేరుకున్నారు. విచారణ అనంతరం జగన్ అక్కడి నుంచి లోటస్‌పాండ్‌కు వెళ్లిపోయారు.

## కేటీఆర్‌పై రాజకీయ కక్ష సాధింపు



**అక్షరటుడే, హైదరాబాద్:** ఫార్ములా ఈ-కార్ రేసింగ్ కేసులో మాజీ మంత్రి కేటీఆర్‌ను ఏసీబీ విచారించేందుకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అనుమతించడంపై మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు స్పందించారు. కేటీఆర్‌పై రాజకీయ కక్ష సాధింపు చర్యలకు ఇది పరాకాష్ఠ అని ఆయన విమర్శించారు.

## శబరిమలలో ఆంక్షలు



**అక్షరటుడే, నేషనల్‌డెస్క్:** శబరిమల అయ్యప్ప ఆలయానికి భారీగా భక్తులు వస్తుండడంతో దర్శనం కోసం ఆంక్షలు విధించారు. రద్దీ కారణంగా, స్పాట్ బుకింగ్ ద్వారా రోజుకు 20 వేల మందిని మాత్రమే అనుమతించాలని నిర్ణయించారు. బుధవారం వరకు 30 వేల మందిని అనుమతించారు. అంతేగాకుండా 24వ తేదీ (సోమవారం) వరకు ప్రతి రోజూ 5 వేల మంది భక్తులను మాత్రమే స్పాట్ బుకింగ్ ద్వారా అనుమతిస్తారు. ఆ తర్వాత, ప్రతిరోజూ 20 వేల మంది భక్తులను అనుమతిస్తారు. అంతకు మించి భక్తులు ఆన్‌లైన్‌లో బుకింగ్ చేసుకోకుండా వస్తే, వారికి మరుసటి రోజు మాత్రమే స్వామి దర్శనం చేసుకునే అవకాశం కల్పిస్తారు.

## వేములవాడ ఆలయంలో ఉద్యోగుల బదిలీలు

**అక్షరటుడే, వేములవాడ :** వేములవాడ ఆలయ ఉద్యోగులకు ఈవో షాక్ ఇచ్చారు. పలువురు ఉద్యోగులను బదిలీ చేశారు. 17 మంది ఆలయ ఉద్యోగులను అంతర్గత బదిలీ చేస్తూ ఈవో రమాదేవి ఉత్తర్వులు జారీ చేశారు. రాజన్న ఆలయంలో అక్రమాలు, అవకతవకలు జరుగుతున్నట్లు ఇటీవల ఆరోపణలు వచ్చిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో బదిలీలు చేపట్టినట్లు తెలుస్తోంది. ఇద్దరు ఏఈవోలు, నలుగురు సూపరింటెండెంట్లు, ఇద్దరు సీనియర్ అసిస్టెంట్లు, ఏడుగురు జూనియర్ అసిస్టెంట్లు, ఒక రికార్డ్ అసిస్టెంట్, ఒక అటెండర్‌ను ఈవో బదిలీ చేశారు.

**సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం సంచలన తీర్పు వెలువరించింది. బిల్లుల పెండింగ్ విషయంలో రాష్ట్రపతి, గవర్నర్లకు కోర్టులు గడువు నిర్దేశించలేవని పేర్కొంది. ఈ మేరకు సీజేఐ బీఆర్ గవాయ్ నేతృత్వంలోని ఐదుగురు న్యాయమూర్తుల ధర్మాసనం గురువారం జడ్జిమెంట్ ఇచ్చింది.**

—అక్షరటుడే, హైదరాబాద్ ప్రతినిధి



## రాష్ట్రపతి, గవర్నర్లకు

# గడువు విధించలేం

- బిల్లులు పెండింగ్‌పై సుప్రీంకోర్టు
- ప్రెసిడెన్షియల్ రిఫరెన్స్‌పై రాజ్యాంగ ధర్మాసనం సంచలన తీర్పు
- కారణం లేకుండా గవర్నర్లు బిల్లు వెనక్కి పంపలేరని వ్యాఖ్య

రాష్ట్రపతి, గవర్నర్ వద్ద పెండింగ్‌లో ఉన్న బిల్లుల ఆమోదంపై సమయాన్ని కోర్టులు నిర్దేశించలేవని ధర్మాసనం స్పష్టం చేసింది. ఆ అధికారం సుప్రీంకోర్టుకు లేదని సీజేఐ పేర్కొన్నారు. అలా చేయడం అధికారాల విభజనను ఉల్లంఘించడమేనని వ్యాఖ్యానించారు. బిల్లులకు గవర్నర్ ఆమోదం ఇవ్వకపోతే తిరిగి అసెంబ్లీకి పంపాలని ధర్మాసనం సూచించింది. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము దాఖలు వేసిన పిటిషన్‌పై విచారణ చేపట్టిన రాజ్యాంగ ధర్మాసనం ఈ మేరకు తీర్పు వెలువరించింది. రాష్ట్ర శాసన సభలో ఆమోదించి గవర్నర్, రాష్ట్రపతికి పంపిన బిల్లును ఆమోదించే విషయంలో, వారికి న్యాయస్థానాలు ఎలాంటి గడువు విధించలేవని తెలిపింది. అలాగే కారణం చెప్పకుండా గవర్నర్లు బిల్లును వెనక్కి పంపకూడదని స్పష్టం చేసింది.

### తమిళనాడు కేసులో..

రాష్ట్రపతి, గవర్నర్లు తమ వద్దకు వచ్చిన బిల్లులకు మూడు నెలల్లో ఆమోదం తెలపాలని సుప్రీంకోర్టు గతంలో తీర్పు చెప్పింది. తమిళనాడు ప్రభుత్వం వర్సెస్ గవర్నర్ కేసులో సుప్రీంకోర్టు డివిజన్ బెంచ్ తీర్పు చెప్పగా.. తాజాగా దానిని రాజ్యాంగ ధర్మాసనం కొట్టివేసింది. తమిళనాడు ప్రభుత్వం పంపిన కొన్ని బిల్లులను గతంలో ఆ రాష్ట్ర గవర్నర్ ఆమోదించలేదు. వాటిని తన వద్ద అట్టిపెట్టుకున్నారు. దీనిపై తమిళనాడు ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఆ సమయంలో విచారణ జరిపిన డివిజన్ బెంచ్ రాష్ట్రపతి, గవర్నర్ మూడు నెలల్లో బిల్లులపై నిర్ణయం ప్రకటించాలని పేర్కొంది. లేదంటే బిల్లులు ఆమోదం పొందినట్లేనని చెప్పింది.

### రాష్ట్రపతి స్పష్టత కోరడంతో..

తమిళనాడు స్టేట్ వర్సెస్ గవర్నర్ కేసులో సుప్రీం తీర్పుపై రాష్ట్రపతి రాజ్యాంగ ధర్మాసనాన్ని స్పష్టత కోరారు. ఆర్టికల్ 200, 201 కింద కోర్టులు కాలపరిమితి చర్యను తప్పనిసరి చేయవచ్చా లేదా అనే దానిపై స్పష్టత ఇవ్వాలని రాష్ట్రపతి పిటిషన్ వేశారు. దీనిపై విచారణ చేపట్టిన రాజ్యాంగ ధర్మాసన కీలక వ్యాఖ్యలు చేసింది. గవర్నర్ ముందు పెండింగ్‌లో ఉన్న బిల్లులకు కోర్టులు డీమ్డ్ అస్సెంట్ మంజూరు చేయలేవని కూడా ధర్మాసనం పేర్కొంది. తమిళనాడులోని 10 బిల్లులకు డీమ్డ్ అస్సెంట్ మంజూరు చేయడానికి ఇద్దరు న్యాయమూర్తుల ధర్మాసనం ఆర్టికల్ 142ను ఉపయోగించడం దాని అధికారానికి మించినదని పేర్కొంది. గవర్నర్లు, రాష్ట్రపతికి ఉన్న రాజ్యాంగ అధికారాలను తాము అధిగమించలేమని కోర్టు పేర్కొంది. అదే సమయంలో గవర్నర్లు బిల్లులకు నిరవధికంగా ఆమోదాన్ని నిలిపివేయలేరని ధర్మాసనం స్పష్టం చేసింది.

## కేటీఆర్‌కు షాక్..!

**ఫార్ములా ఈ-రేసు కేసులో విచారణకు గవర్నర్ అనుమతి**



**అక్షరటుడే, హైదరాబాద్:** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌కు షాక్ తగిలింది. ఫార్ములా ఈ-కారు రేసు కేసులో ఆయన విచారణకు గవర్నర్ అనుమతించారు. దీంతో ఏసీబీ అధికారులు ఆయనపై అభియోగాలు నమోదు చేసే అవకాశం ఉంది. బీఆర్ఎస్ హయాంలో హైదరాబాద్ నగరంలో ఫార్ములా ఈ-కారు రేసు నిర్వహించిన విషయం తెలిసిందే. అయితే ఈ వ్యవహారంలో పెద్ద ఎత్తున అవినీతి జరిగిందని కాంగ్రెస్ ఆరోపించింది. ఈ మేరకు అధికారంలోకి వచ్చాక ఆ కేసు విచారణను ఏసీబీకి అప్పగించింది. ఈ కేసులో ఏ-1 కేటీఆర్, ఏ-2గా సీనియర్ ఐఏఎస్ అధికారి అరవింద్ కుమార్ పేర్లను ఏసీబీ చేర్చింది. మాజీ మంత్రి కేటీఆర్‌ను ఇప్పటికే నాలుగు సార్లు విచారించింది. అరవింద్ కుమార్‌ను సైతం పలుమార్లు విచారించి కీలక విషయాలు రాబట్టింది. అనంతరం కేటీఆర్ ప్రాసిక్యూషన్‌కు అనుమతి ఇవ్వాలని ప్రభుత్వం గవర్నర్‌కు గతంలో లేఖ రాసింది. దీంతో ఆయన విచారణకు అనుమతి ఇచ్చారు.

### అరెస్ట్ తప్పదా..

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి బీఆర్ఎస్ హయాంలో జరిగిన పలు అక్రమాలు, అవినీతిపై విచారణ చేపడుతోంది. కాళేశ్వరం కమిషన్ విచారణ పూర్తయింది. ఫోన్ ట్యాపింగ్ విచారణ కొనసాగుతోంది. మరోవైపు ఫార్ములా ఈ రేసు కేసు విచారణ సైతం అధికారులు చేపడుతున్నారు. కేటీఆర్‌ను అరెస్ట్ చేస్తారని గతంలో ప్రచారం జరిగింది. కేటీఆర్ సైతం అరెస్ట్ చేస్తే కొన్ని రోజులు రెస్ట్ తీసుకుంటానని గతంలో వ్యాఖ్యానించారు. అయితే ప్రభుత్వం మాత్రం ఆయనను అరెస్ట్ చేయలేదు. తాజాగా ఫార్ములా ఈ-రేసు కేసులో విచారణకు గవర్నర్ అనుమతి రావడంతో అరెస్ట్ చేసే అవకాశం ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది.

## పోలీసు కస్టడీలో ఐబొమ్మ రవి..



**అక్షరటుడే, హైదరాబాద్:** సినిమా పైరసీ కేసులో ప్రధాన నిందితుడు, ఐబొమ్మ వైబ్‌సైట్ నిర్వాహకుడు రవిని పోలీసులు కస్టడీకి తీసుకున్నారు. బషీర్‌బాగ్‌లోని సైబర్‌క్రైం పోలీస్ స్టేషన్‌కు అతడిని తరలించారు. పైరసీ కేసుకు సంబంధించి వివిధ కోణాల్లో అధికారులు ప్రశ్నిస్తున్నారు. కాగా.. రవిని ఐదు రోజుల పాటు పోలీసు కస్టడీలోకి తీసుకొనేందుకు బుధవారం నాంపల్లి కోర్టు అనుమతి ఇచ్చిన విషయం తెలిసిందే.

## సౌతాఫ్రికా వన్డే సిరీస్‌కు బుమ్రా, హార్దిక్ దూరం!



**అక్షరటుడే, స్పోర్ట్స్ డెస్క్ :** వచ్చే ఏడాది జరగబోయే టీ20 ప్రపంచ కప్ నేపథ్యంలో భారత క్రికెట్ జట్టులో కీలక మార్పులు చోటు చేసుకునే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ నెల 30 నుంచి సౌతాఫ్రికాతో మూడు వన్డేల సిరీస్‌లో టీమిండియా తలపడనుంది. అయితే ఈ కీలక సమయంలో స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా, ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్య అందుబాటులో ఉండకపోవచ్చని సమాచారం బయటకు వచ్చింది. సెప్టెంబర్‌లో జరిగిన ఆసియా కప్ టీ20 ఫైనల్‌కు ముందు హార్దిక్ తొడ కండరాలకు తీవ్రమైన గాయం ఏర్పడింది. ప్రస్తుతం బెంగళూరులోని నేషనల్ క్రికెట్ అకాడమీలో రిహాబ్ తీసుకుంటున్న ఆయన ఇప్పుడిప్పుడే కోలుకుంటున్నారు.

## భారత్‌కు అమెరికాఆయుధాలు




**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** అమెరికా ప్రభుత్వం భారత్‌కు సుమారు 93 మిలియన్ అమెరికన్ డాలర్ల విలువైన రక్షణ సామగ్రి అమ్మకానికి ఆమోదం తెలిపింది. ఈ భారీ ఒప్పందం ద్వారా భారత సైనిక బలగాలకు అత్యాధునిక యాంటీ ట్యాంక్ క్షిపణులు, ఆర్టిలరీ షెల్స్ అందనున్నాయి. ఈ ప్యాకేజీలో ప్రధానంగా 100 ఎఫ్‌జీఎం148 జావెలిన్ యాంటీ ట్యాంక్ గైడెడ్ మిస్సైల్స్, 25 లైట్ వెయిట్ కమాండ్ లాంచ్ యూనిట్లు ఉన్నాయి. అలాగే 216 ఎక్స్‌కాలిబర్ ప్రెసిషన్ గైడెడ్ ఆర్టిలరీ ప్రొజెక్టైల్స్ ఉన్నాయి. అమెరికా డిఫెన్స్ సెక్యూరిటీ కో-ఆపరేషన్ ఏజెన్సీ ఈ బదిలీకి సంబంధించిన వివరాలను కాంగ్రెస్‌కు తెలియజేసింది.

## అనిల్ అంబానీ మరిన్ని ఆస్తులు అటాచ్

**అక్షరటుడే, బిజినెస్ డెస్క్:** రిలయన్స్ గ్రూప్ ఛైర్మన్ అనిల్ అంబానీ మనీలాండరింగ్ ఆరోపణలు ఎదుర్కొంటున్న సంగతి తెలిసిందే. దర్యాప్తును ఈడీ ముమ్మరం చేసింది. తాజాగా రిలయన్స్ గ్రూప్‌నకు చెందిన మరిన్ని ఆస్తులను అటాచ్ చేసినట్లు తెలుస్తోంది. ఇప్పటికే రూ.7,500 కోట్ల విలువైన ఆస్తులను ఈడీ అటాచ్ చేసింది. తాజాగా జత చేసిన ఆస్తుల విలువ రూ.1,400 కోట్లకు పైగా ఉండొచ్చని అంచనా. ఈడీ తాజా చర్యలపై రిలయన్స్ గ్రూప్ ఇప్పటివరకు ఎలాంటి ప్రకటన చేయలేదు.

## రష్యా–ఉక్రెయిన్ శాంతి ప్రణాళికకు ట్రంప్ ఆమోదం



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఉక్రెయిన్‌కు షాక్ ఇచ్చారు. రష్యాఉక్రెయిన్ యుద్ధాన్ని ముగించే లక్ష్యంతో 28 అంశాల ప్రతిపాదనకు ఆయన ఆమోదం తెలిపారు. అయితే ఇది రష్యా అధ్యక్షుడు పుతిన్‌కు అనుకూలంగా ఉండడం గమనార్హం. దీనిపై ఎలాంటి హడావుడి లేకుండా ట్రంప్ రహస్యంగా ఆమోదం తెలిపారు. ట్రంప్ బృందంలోని సీనియర్ సభ్యులు కొన్ని వారాలుగా శాంతి ఒప్పందం కోసం పని చేస్తున్నారు. రష్యా రాయబారి కిరిల్ దిమిత్రివ్‌తో పాటు ఉక్రెనియన్ అధికారులతో చర్చలు జరుపుతున్నారు. ఈ ప్రక్రియ ట్రంప్ మునుపటి 20పాయింట్ల గాజా ప్రణాళిక వెనుక ఉన్న విధానాన్ని ప్రతిబింబిస్తుందని చెబుతారు. అమెరికా ప్రత్యేక రాయబారి స్టీవ్ విట్‌కాఫ్ ఈ ప్రతిపాదనను రూపొందించే చొరవకు నాయకత్వం వహిస్తున్నారు.

## బీహార్ సీఎంగా నితీశ్ కుమార్ ప్రమాణస్వీకారం



**అక్షరటుడే, నేషనల్ డెస్క్ :** బీహార్ ముఖ్యమంత్రిగా జేడీయూ అధ్యక్షుడు నితీశ్ కుమార్ గురువారం ప్రమాణ స్వీకారం చేశారు. గవర్నర్ ఆరిఫ్ మొహమ్మద్ ఖాన్ ఆయనతో ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, అమిత్ షా, జేపీ నడ్డా, ఎన్డీయే నాయకులు పాల్గొన్నారు. బీహార్‌లో ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఎన్డీయే కూటమి ఘన విజయం సాధించిన విషయం తెలిసిందే. ఈ కూటమి 202 స్థానాల్లో విజయ కేతనం ఎగుర వేసింది. దీంతో తమ సీఎం అభ్యర్థిగా నితీశ్‌ను ఎన్డీఏ ప్రకటించింది. ఈ మేరకు నితీశ్‌కుమార్ గవర్నర్‌ను కలిసి ప్రభుత్వం ఏర్పాటు చేస్తామన్నారు. దీంతో బీహార్ రాజధాని పాట్నాలోని గాంధీ మైదాన్‌లో గురువారం నితీశ్‌కుమార్ ప్రమాణ స్వీకార వేడుక నిర్వహించారు. ముఖ్యమంత్రి నితీశ్‌కుమార్‌తో పాటు ఎన్డీఏ కూటమి నుంచి పలువురు మంత్రులుగా ప్రమాణం చేశారు.